నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం | మే 30, 2024 | www.navatelangana.com

## సమైఖ్య క్యాంటీన్‌లో తనిఖీ

**నవతెలంగాణ-కామారెడ్డి**

కామారెడ్డి కలెక్టరేట్ లోని శ్రీ లక్ష్మీ నరసింహ జిల్లా మహిళా సమైక్య క్యాంటీన్ ను బుధవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిని సునీత సందర్శించారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె క్యాంటీన్ నిర్వహకులతో మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమైక్య అధ్యక్షురాలు రాజమణి, శోభ, లక్ష్మి, సులోచన, పుష్ప, లక్ష్మి డిపిఎం సుధాకర్, ఏపీఎం రాజేందర్, ప్రతినిధులు సంతోష్, రవీందర్ తదితరులు ఉన్నారు.


క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారిని సునీత

## బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- రికార్డులు తనిఖీ చేసిన ఆర్డీవో

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బాన్సువాడ రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్డిఓ) రాథోడ్ రమేష్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులు, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించి బాధ్యతగా ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని ఎమ్మార్వో దశరథ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో దశరథ్, రెవిన్యూ సిబ్బందిలు పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

# క్వింటా 'పదివేల' పైమాటే


పెసర పంట సాగు (ఫైల్)

- పప్పు దినుసుల సాగుపై రైతుల ఆసక్తి
- ఏటికేడు పెరుగుతున్న సాగువిస్తీర్ణం
- కొనుగోలు కేంద్రాల్లో కంటే బయటే అధిక రేటు
- ప్రభుత్వం సహకారమందిస్తే.. మరింత పెరగనున్న సాగు

**నవతెలంగాణ-బోధన్/జుక్కల్**

పప్పు దినుసులు పండించేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ నీటి వ్యయంతో తక్కువ సమయంలో పంట చేతికివస్తుండటంతో ఏటికేడూ పప్పు దినుసుల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పప్పు దినుసులకు మార్కెట్‌లో డిమాండ్ నెలకొనడంతో క్వింటా పదివేల రూపాయలకు పై మాటే ధర పలుకుతుంది. దీంతో పప్పు దినుసులు సాగు చేసేందుకు రైతులు ముందుకువస్తున్నారు. శనగ పంట విస్తీర్ణం తగ్గడం పంట, దిగుబడి తగ్గడంతో రైతులు శనగ పంట వేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా మినుములు, పెసర్లు, కంది పంట వేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

బోధన్ నియోజకవర్గంలోని బోధన్, రెంజల్ మండలంలోనే అధికంగా పప్పు దినుసులు సాగు చేస్తున్నారు. కంది పప్పు.. ధాన్యాల్లో కెల్లా ప్రధానమైన వంట. ఈ కంది పంటను ప్రధాన వాణిజ్య పంటలైన పత్తి, మిరప, పొగాకు ప్రత్యామ్నాయంగాను, మిశ్రమ పంటగా తక్కువ కాల పరిమితి గల అపరాలు తృణ ధాన్యాలు, వేరుశనగ లాంటి పంటలతో కందిని ఖరీఫ్ కాలంలో పండిస్తున్నారు. నీటి వసతిగల ప్రంతాల్లో తొలకరి వర్షాలు రాగానే తక్కువ కాలపరిమితి గల పైర్లు సాగు చేసి దాని తర్వాత కంది పంటను రబీలో సాగు చేస్తున్నారు. కంది సాగు వలన భూసారం పెరుగుతుంది. పంట ఆకులు, వేర్లు, కాండం నేలలో పడి సేంద్రియ పదార్థంగా మారడం వల్ల నేల భౌతిక, రసాయనిక లక్షణాలు మెరుగుపడతాయి. అంతేగాక భూమిలో మేలు చేసే సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి భూమి గుల్లబారి నీరు నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుంది. కంది పంట వేర్లలో ఉండే రైజోబియం బుడిపెల ద్వారా వాతావరణంలోని నత్రజని గ్రహించి నేలకు సారవంతం చేస్తుంది. దాంతో రైతులు అంతర పంటగా కంది సాగు చేయడానికి ఆసక్తి చూపుతారు.


వేరుశనగర పంట..

**బోధన్ నియోజకవర్గంలో 800 ఎకరాలలో పప్పు దినుసులు సాగు**

బోధన్ నియోజకవర్గంలో ప్రతి ఏటా పప్పు దినుసుల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. బోధన్ మండలంలోని భూలక్ష్మి క్యాంప్, కొప్పర్గా, హంగర్గా, పెగడపల్లి, హూన్సా, అలాగే రెంజల్ మండలం నీల, కందకుర్తి గ్రామాలలో రైతులు మినుములు, తొగర్లు, పెసర్ల పంటను సాగు చేస్తారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్లో అకాల వర్షాలకు మీరు అధికంగా ఉండడం వలన పప్పు దినుసులు సాగు తగ్గుతుంది. అలాగే రబీ సీజన్లో రైతులు వలు పంటలలో అంతర పంటగా ప్రత్యేకంగా పప్పు దినుసులు సాగు చేస్తుంటారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఈ పంటలను కొనుగోలు చేస్తుంది ప్రభుత్వం క్వింటాలకు ఎనిమిది వేల రూపాయలు చెల్లించి పప్పు దినుసులు పంటలను కొనుగోలు చేస్తుంది. అలాగే ప్రభుత్వం కొనుగోలు చేసే ధర తక్కువ ఉండడంతో రైతులు దళారులకు క్వింటలుకు 10,000/- రూపాయలకు విక్రయిస్తున్నారు. ఎకరానికి 8 నుండి 10 క్వింటలు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. అందులో ఎన్నాదై విత్తనాలు అధిక దిగుబడిస్తున్నాయని రైతులు తెలిపారు.


### జుక్కల్‌లో అనాదిగా..

**జుక్కల్ :** జుక్కల్ మండలంలో అనాధిగా పప్పు దినుసుల సాగుకు పెట్టింది పేరుగా మారింది. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం.. మండలంలో గతేడాది ఏడువేల ఎకరాల్లో పప్పు దినుసులను సాగు చేశారు. పూర్వీకుల నుండి పప్పు దినుసుల పంటలు అనాదిగా రైతులు పండిస్తు వస్తున్నారు. 'ఉప్పులేని కూర ఒప్పదు.. రుచులకు పప్పులేని తిండి ఫలము లేదు" అన్న సామెతకు తగ్గట్టు వంటల్లో పప్పు వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో పప్పు దినుసుల రేట్లు పెరిగినా.. డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు సైతం వీటి సాగు పట్ల అమితాసక్తి కనబరుస్తున్నారు. 90 నుంచి 110 రోజుల్లో పంట చేతికి వస్తుండటంతో రబీ సాగుకు పెట్టుబడికి ఉపయోగకరంగా ఉంటుంది. పక్కనే ఉన్న మహరాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల రైతులు కూడా ఇటువంటి పంటల పైన ఎక్కువగా ఆధార పడి పండిస్తుంటారు. ప్రస్తుతం విత్తనాలు గతేడాది పండించిన రైతుల నుండి అప్పుగా తీసుకుని పంట పండిన తరువాత తిరిగి తీసుకున్న దానికి ఇంకోంత కలిపి తిరిగి ఇస్తుంటారు.

ఈ సారి పప్పుల దినుసుల సాగు విస్తీర్ణం గతేడాది కంటే పెరిగే అవకాశాలు ఉన్నాయి. తక్కువ సమయంలో రైతులకు పంట చేతికి అందడంతో పాటు మంచి ధర వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

### పప్పు పంటలు సాగు చేస్తున్నారు

రైతులు బోధన్ నియోజకవర్గంలో పప్పు పంటలైన కంది, మినుములు, పెసర్ల పంటలు సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. అలాగే పప్పు దినుసుల పంటలు సాగుచేసిన రైతులకు ప్రభుత్వం కూడా ప్రోత్సాహాన్నిస్తూ కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలను కొనుగోలు చేస్తుంది. క్వింటాలకు 8000/- రూపాయల మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం మినుములు లాంటి పంటలను కొనుగోలు చేసింది. రైతులు ఈ పప్పు పంటలను సాగు చేస్తే వారికి లాభదాయకమే. అలాగే అంతర పంటగా కూడా ఈ పప్పు దినుసులు పంటలను సాగు చేస్తే రైతులకు ఆర్థికభారం తగ్గుతుంది.



**సంతోష్ కుమార్ మండల.. వ్యవసాయ అధికారి, బోధన్.**


వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌర సరఫరాల ఇంచార్జి మేనేజర్ నిత్యానందం

### నాణ్యతా ప్రమాణాలకు
## అనుగుణంగా ధాన్యాన్ని సేకరించాలి

- పౌర సరఫరాల ఇంచార్జి మేనేజర్ నిత్యానందం

**నవతెలంగాణ-భిక్కనూర్**

కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా సేకరించి వెంటనే మిల్లులకు తరలించాలని, మిల్లర్లు కూడా త్వరగా దించుకోవాలని పౌర సరఫరాల ఇంచార్జి జిల్లా మేనేజర్ నిత్యానందం కేంద్రం నిర్వాహకులను, మిల్లర్లను ఆదేశించారు. బుధవారం భిక్కనూర్ మండలంలోని కాచాపూర్ కొనుగోలు కేంద్రాన్ని, బస్వాపూర్‌లోని విజయ గణపతి రైస్ మిల్, పూర్ణిమ రైస్ మిల్, భిక్కనూర్‌లోని సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులను డిప్యూటీ తహసీల్దార్లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మార్చి 26న 350 కేంద్రాల ద్వారా కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించగా 327 కేంద్రాలలో పూర్తయిందని, ఇంకా 23 కేంద్రాలలో ధాన్యం మాత్రమే మిగిలి ఉందని అన్నారు. అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ ప్రతి రోజు మిల్లర్లు, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు, కేంద్రాల నిర్వాహకులతో సమీక్షిస్తూ త్వరితగతిన ధాన్యం సేకరణ పూర్తయ్యేలా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ మానిటరింగ్ చేస్తున్నారని అన్నారు. సేకరించిన ధాన్యానికి 92 శాతం మేర అనగా రూ. 623 కోట్లు రైతుల ఖాతాలో డబ్బులు జమచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కొనుగొలు కేంద్రాల సిఈఓలు, రైతులు, తదితరులు ఉన్నారు.

## 31న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

**నవతెలంగాణ-కామారెడ్డి**

కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 31న ఉదయం 11 గంటలకు కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కామారెడ్డి ఆర్డీవో రఘునాథ్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తామన్నారు. కౌన్సిలర్లు సకాలంలో హాజరుకావాలని ప్రకటనలో సూచించారు.

## అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేయాలి

- కాపాడేవాడే కామం పేరుతో వేధిస్తుంటే ఎటు పోవాలి..? : సీఐటీయూ

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

స్కానింగ్ సెంటర్‌కు వచ్చిన మహిళలను స్కానింగ్ పేరుతో ఫోటోలు, వీడియోలు చిత్రీకరిస్తూ వేధింపులకు పాల్పడుతున్న అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను వెంటనే సీజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు. స్కానింగ్ పేర్లతో నడుపుతున్న అయ్యప్ప స్కానింగ్ సెంటర్ ను వెంటనే సీజ్ చేయాలని, మహిళలు రోగం వచ్చి స్కానింగ్ కోసం పోతే కీచకుడు ఆపరేటర్ ప్రశాంత్ కామంతో రహస్యంగా కెమెరాలను బిగించి అశ్లీల దృశ్యాలను చిత్రీకరించి ఫోన్ నెంబర్లను తీసుకొని మహిళల్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నట్టు విమర్శించారు. కీచకుడిని వెంటనే అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళల పై రోజురోజుకు హత్యలు, హత్యాచారాలు లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని, రోగమొచ్చి వైద్యుడు దగ్గరికి వెళ్తే అక్కడ సైతం రక్షణ లేకుండా పోతోందని మండిపడ్డారు. ఇటీవల కామారెడ్డి డిఎంహెచ్ఓ మహిళ వైద్యులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, అయనను సస్పెండ్‌తో సరిపెట్టకుండా ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు కమిటీల పేర్లతో కాలయాపన చేయొద్దని స్కానింగ్ సెంటర్ నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకొని స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న స్కానింగ్ సెంటర్‌లను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ చేసి పర్మిషన్ లేని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని, బయటకొచ్చింది ఒకే ఒక స్కానింగ్ సెంటర్ ఇలాంటివి ఇంకా ఉన్నాయని స్కానింగ్ సెంటర్లను సందర్శించి వారిపై కూడా కఠినంగా యాక్షన్ తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, సిఐటియు నాయకులు మీనా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూర్జహాన్

# వేతనాలు రాక అల్లాడుతున్నాం

- ఆరు నెలల వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికుల వినతి
- దుకాణాల్లో ఉద్దెర కూడా ఇవ్వట్లేదని వాపోత

**నవతెలంగాణ-మద్నూర్**

అసలే అంతంత వేతనం. అయినా సక్రమంగా ప్రతినెలా చేతికి అందకపోవడంతో పారిశుధ్య కార్మికుల కుటుంబాలు అల్లాడుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు ఇక్కట్లు పడుతున్నారు. ఆరు నెలల బకాయిలు వేతనాలు చెల్లించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు ప్రత్యేకాధికారికి బుధవారం వినతిపత్రం అందజేశారు.

మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో విధులు నిర్వహించే మల్టీపర్పస్ పారిశుధ్య కార్మికులకు గత ఆరు మాసాలుగా జీతాలు అందక కార్మికులంతా అలమటిస్తున్నారు. గత సంవత్సరం డిసెంబర్ నుంచి మే నెల మాసం వరకు ఆరు మాసాలుగా జీతాలు రాక కార్మికులంతా ఆందోళన వ్యక్తం చేస్తూ జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. తెల్లవారకమునుపే ఊరంతా శుభ్రం పరిచే కార్మికులకు ఆరు మాసాలుగా జీతాలు అందడం లేక ఆ కుటుంబాలు ఎటుతోచని స్థితిలో అల్లాడిపోతున్నాయి. కుటుంబానికి కావలసిన వస్తువులు కొనాలంటే దుకాణదారులు ఉద్దెరా కూడా ఇవ్వలేని పరిస్థితి కొనసాగుతుందని జీతాల కోసం అధికారులకు అడుగుతే గ్రాంటు రాలేదని సమాధానం ఇస్తున్నారని వాపోయారు. వెంటనే పెండింగ్ జీతాలు అన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మల్టీపర్పస్ కింద 26 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు గ్రామ కార్యదర్శి తెలిపారు.


గ్రామ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

# వైస్ ఎంపీపీ.. బీఆర్ఎస్ వశం

- నాగిరెడ్డిపేట్ వైస్ ఎంపీపీగా ఎన్నికైన టేకులపల్లి వినీత

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డి పేట్ మండల పరిషత్ వైస్ ఎంపీపీ బీఆర్ఎస్ వశమైంది. బుధవారం నిర్వహించిన ఎన్నికలో పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీత ఎన్నికైంది. వివరాల్లోకి వెళ్తే.. వైస్ ఎంపీపీ ఎన్నిక రిటర్నింగ్ అధికారి వీరస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఎన్నికకు తొమ్మిది మంది ఎంపీటీసీలు హాజరయ్యారు. బొల్లారం ఎంపీటీసీ ఊర లావణ్య పోచారం, ఎంపీటీసీ టేకులపల్లి వినీత వైస్ ఎంపీపీ బరిలో నిలిచారు. బొల్లారం ఎంపీటీసీ ఊర లావణ్యకు తాండూర్ ఎంపీటీసీ రాజదాస్ ప్రతిపాదించగా, జనగంపల్లి ఎంపీటీసీ సుజాత బలిపరిచారు. అదేవిధంగా పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీత బరిలో నిలవగా, ఆత్మకూరు ఎంపీటీసీ మోతే శ్రీను ప్రతిపాదించారు. ఎంపిటిసి ఉప్పల నారాయణ ఆమెను బలపరిచారు. అనంతరం వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించగా జాన్కంపల్లి ఎంపీటీసీ ఊర లావణ్యకు మూడు ఓట్లు రావడం జరిగింది. అదేవిధంగా పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీతకు ఆరు ఓట్లు రావడంతో వైస్ ఎంపీపీగా పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీత ఎన్నికయ్యారు. ఎన్నికకు సంబంధించిన వివరాలను సీఈఓకు పంపనున్నట్లు రిటర్నింగ్ అధికారి వీరస్వామి తెలిపారు.

కాగా వైస్ ఎంపీపీ బీఆర్ఎస్ వశం కావడంతో ఆ పార్టీ సంబరాలు చేపట్టాయి. టపాసులు పేలుస్తూ, స్వీట్లు పంచిపెట్టి వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎన్నికైన టేకులపల్లి వినీత


ఎన్నిక నిర్వహిస్తున్న అధికారి వీరస్వామి

## జీలుగా విత్తనాలకు నిరీక్షణ

- పత్తాలేని వ్యవసాయాధికారులు

**నవతెలంగాణ-పిట్లం**

ఖరీఫ్ సీజన్‌కుగాను జీలుగా విత్తనాల కోసం మండల రైతులు నిరీక్షిస్తున్నారు. రైతులు వ్యవసాయ సాగు పనులలో బిజీగా ఉన్నప్పటికీ వ్యవసాయ అధికారులు జీలుగా విత్తనాలు అందించడంలో విఫలమవుతున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 26 గ్రామాలకు గాను మండల వ్యాప్తంగా ఈ యేడు 24 వేల ఎకరాలలో సాగు విస్తీర్ణం చేపట్టనున్నారు. రైతులు వ్యవసాయ పనులు ప్రారంబిసున్నప్పటికి వ్యవసాయ విస్తీర్ణాధి కారుల జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శాఖ పరంగా ఖరీఫ్ సీజన్ కు గాను విత్తనాలు, ఎరువులు, పంటల సూచనలు, సలహాలు అందజేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా వ్యవరిస్తున్నారని రైతులు ఆందోళల చెందుతున్నారు. ఇటీవల నిర్వహించిన మండల పరిషద్ సర్వసభ్య సమావేశం లోను నాయకులు సన్న వడ్ల విషయం లోను ఏ రకం వడ్లు పండించాలని , జీలుగా విత్తనాలు ఎప్పుడు అందిస్తారని నిలదీసినప్పటికి సమాధానం చెప్పలేక దాటవేశారు. మృగశిర కార్తి అనంతరం జీలుగా విత్తనాలను అందించిన లాభమేమని రైతులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే జీలుగ విత్తనాల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

# విప్ ధిక్కరించిన వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డిపేట్ వైస్ ఎంపీపీ ఎన్నికలో విప్ ధిక్కరించిన ఎంపిటిసి లకు తగిన మూల్యం చెల్లించక తప్పదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచి ఇతర పార్టీలోకి వెళ్లి ఇతర పార్టీ నాయకులకు సపోర్ట్ చేసిన వారికి కాంగ్రెస్ పార్టీ తగిన బుద్ధి చెబుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ జారీ చేసిన విప్‌ను తిరస్కరించి ఇతర పార్టీ నాయకులకు సపోర్ట్ చేసిన వారు తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన అన్నారు. విప్ ధిక్కరించి నిర్వహించిన ఎన్నిక చెల్లదని ఆయన అన్నారు. నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఆయన గుర్తు చేశారు. వారం రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపీపీగా అవుతారని ఆయన అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి, దివిటి కిష్టయ్య, ఇమామ్ లక్ష్మణ్, పర్వత రావు, నారాయణరెడ్డి, ఊర లావణ్య, ధర్మవీర్, నరసింహారెడ్డి, సాయ గౌడ్ శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
గురువారం మే 30, 2024 www.navatelangana.com

## నాణ్యతా లోపంతో కుంగిన రోడ్డు

**నవతెలంగాణ-భీంగల్‌రూరల్**

మండలంలోని ముచ్కూర్ నుంచి పిప్రి గ్రామానికి సుమారు వెళ్లే రోడ్డు కుంగిపోయింది. నాణ్యతలో లోపం వల్ల ఆ రోడ్డు కుంగిపోయిందని అక్కడి స్థానికులు అంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు పోసిన ఆ రోడ్డు నెలరోజులు కాకుండానే కుంగిపోవడం పట్ల ఇరు గ్రామాలకు చెందిన ప్రజలు సంబంధిత కాంట్రాక్టర్‌పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యత లోపంతో రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కుంగిన రోడ్డు

## మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

**నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్**

మాధవ్‌నగర్‌లోని సాయిబాబా మందిరంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవీందర్ ఆధ్వర్యంలో హుండీని బుధవారం లెక్కించారు. అందుకుగానూ రెండు నెలల నాలుగు రోజులకు సంబంధించిన హుండీ డబ్బులు లెక్కించగా రూ.3,02,485 వచ్చినట్లు సుప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది హరితరాణి, మాణిక్య శర్మ, సంతోష్ కుమార్ గౌడ్, సోమయ్య పాల్గొన్నారు.


ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## పోరాటాలతోనే బీడీ కార్మికుల మూలవేతనాల పెంపు

- ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్

**నవతెలంగాణ-ధర్పల్లి**

పోరాటాల ఫలితమే బీడీ కార్మికుల మూలవేతనాల పెంపు అని, పోరాటాల ఫలితంగా బీడీ యజమాన్యం మూలవేతనాలు పెంచుతూ అగ్రిమెంట్ చేసుకున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్ తెలియజేశారు. బుధవారం ధర్పల్లి మండలం, రామడుగు ప్రాజెక్టులో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల అగ్రిమెంట్ 30.4.24తో ముగిసిందని, నూతన వేతనాల ఒప్పందం గురించి బీడీ కంపెనీ యజమానులతో డిమాండ్ లెటర్ ఇవ్వగా యాజమాన్యం అగ్రిమెంట్ చేసుకున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీడీ, కార్మిక సంఘాలు, కలిసి వేతన ఒప్పందం కోసం చర్చలు జరిపి.. దీని ప్రకారంగా బీడీలు చుట్టే కార్మికులకు వేతనం 4.25పై పెంచినది, మొత్తం 1000 బీడీలకు మొత్తం కలిపి రూ.49.98 అయిందని అన్నారు. బీడీ ప్యాకింగ్ కార్మికుల నూతనంగా రూ.3650, చాటన్, బట్టివారి, చెన్నివల, ట్రై ఫిల్లర్స్, క్లర్క్‌కు రూ.1700 పెంచారని తెలిపారు. ఈ వేతన ఒప్పందం బీడీ యజమానులు, బీడీ కార్మిక సంఘాలు శాంతియుతంగా చర్చలు జరిపి పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు రాజవ్వ, సాయవ్వ, లక్ష్మి, మాలవ్వ, రామవ్వ, లావణ్య, లత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భాషిత పాఠశాల 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాల 20 వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ సరస్వతీమాత విగ్రహానికి పూజలు నిర్వహించి అనంతరం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ శ్రీ భాషిత పాఠశాల స్థాపించి ఇప్పటికీ 20 సంవత్సరాలు అవుతుందన్నారు. అంతే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ శ్రీ భాషిత పాఠశాలలో తమ పిల్లలు చదువుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. శ్రీ భాషిత పాఠశాలలో నిర్వహించే ఏ కార్యక్రమమైనా ఒక పండగ వాతావరణంలా ఉంటుందని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ తల్లిదండ్రులకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈ వేడుకల్లో శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండు పెట్రోల్ బంకుల స్థల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజాగౌడ్

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మండలంలోని పలు గ్రామాల్లో రెండు పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు చేసేందుకు గానూ లక్ష్మపూర్, జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లో దరఖాస్తు చేసుకోగా.. వాటి రికార్డులను ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో ధరణి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, మండల సర్వేయర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తుల తయారీ పరిశీలన

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఏకరూప దుస్తుల తయారీని డిపియం నీలిమా బుధవారం పరిశీలించారు. ఏకరూప దుస్తుల తయారీని వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపియం రవీందర్‌రెడ్డి, సిసిలు తదితరులు పాల్గొన్నారు.


దుస్తులను పరిశీలిస్తున్న డీపీఎం నీలిమా


బాల్కొండ: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


ధర్పల్లి: మాట్లాడుతున్న పలువురు


ఆర్మూర్: తనిఖీ చేస్తున్న పోలీసులు

### పంట కాలం పూర్తయ్యే వరకు

# బిల్లులు భద్రంగా ఉంచుకోవాలి

- ఏడీఏ కాంపాటి మల్లయ్య
- విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన
- పలు విత్తనాల దుకాణాలు తనిఖీ

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**బాల్కొండ :** విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతు బాధ్యతగా దుకాణం నుండి బిల్లు తప్పని సరిగా తీసుకొని భద్రంగా ఉంచుకోవాలని భీమ్‌గల్ డివిజనల్ ఏడిఏ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని బోదేపల్లి గ్రామంలో భీంగల్ డివిజన్ ఏ.డి.ఏ కాంపాటి మల్లయ్య రైతులకు వానాకాలం పంట సీజన్ ప్రారంభం ముందు విత్తన కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ ముందుగానే తెరచి ఉంచిన సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్లను, బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్ద, ప్యాక్ చేసిన, లేబుల్ చేసిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయవద్దన్నారు. అనంతరం వన్నెల్ (బి)లో విత్తన డీలర్ షాపు తనిఖీ చేశారు. డీలర్ దుకాణం ఎదుట స్టాక్ బోర్డు ఏర్పాటు చేసి విత్తన నిల్వలు కనబడేటట్లు ప్రదర్శించాలన్నారు. ప్రతి రైతుకు బిల్లు, రశీదు, బిల్లుపై కంపెనీ పేరు, లాట్ నెంబర్ వివరాలు ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఇ.ఓ. నిహారిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**లూస్ విత్తనాలు అమ్మితే చర్యలు..**

**ధర్పల్లి :** వర్షాకాలం పంటలకు సంబంధించి రైతులకు లూస్ విత్తనాలు అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ ప్రదీప్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తనాలను విక్రయించేటప్పుడు రైతు వారిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ప్రతి రోజు ఆ సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు అందజేయాలని తెలిపారు. అందరూ తప్పనిసరిగా స్టాక్‌బుక్, రిజిస్టర్‌లు మెయింటెన్ చేయాలని, కంపెనీ నుంచి వచ్చిన విత్తనాలను విక్రయించాలని, ఎట్టి పరిస్థితుల్లో లూజ్ విత్తనాలను అమ్మకూడదని అన్నారు. ఎవరైనా ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు అమ్మితే వారిపై చర్యలుంటాయని తెలిపారు. ఏవో వెంకటేష్ మాట్లాడుతూ.. డీలర్లు అందరూ తప్పనిసరిగా సర్టిపై చేసిన బిల్ బుక్‌లో నుంచి మాత్రమే రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, రసీదులలో వెరైటీ, లాట్ నంబర్స్ రాయాలని, డీలర్స్ తప్పనిసరిగా షాప్‌లలో స్టాక్ బోర్డ్స్ రాయాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసిన రశీదు, విత్తన ఖాళీ సంచులను పంట కాలం ముగిసే వరకు రైతులు తమ వద్ద భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. అలాగే లైసెన్స్ కలిగిన డీలర్స్ వద్ద నుంచి మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాలలో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈఓలు మనోజ్, స్నేహలత, లక్ష్మిప్రసన్న, లావణ్య డీలర్లు పాల్గొన్నారు.

**విత్తన, పురుగు మందు దుకాణాలలో తనిఖీలు**

**కమ్మర్‌పల్లి :** మండలంలోని ఆయా గ్రామాల్లో విత్తన, పురుగు మందులు అమ్మే దుకాణాలలో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంయుక్తంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రసీదు ఇవ్వడంతో పాటు రైతు వారీగా రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేయాలని దుకాణాల యజమానులకు తెలిపారు. దుకాణాలలో గడువు ముగిసిన విత్తనాలు అమ్మితే చట్టపరంగా వారిపైన చర్యలు తీసుకుంటామని దుకాణాల యజమాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్, కమ్మర్‌పల్లి ఎస్ఐ రాజశేఖర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి: తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారి

**వేల్పూర్ విత్తన దుకాణాలలో తనిఖీలు**

**(వేల్పూర్)ఆర్మూర్ :** మండలంలో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ ద్వారా మండలంలోని విత్తన డీలర్ల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. విత్తన దుకాణాలలో గుర్తింపు పొందిన విత్తన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు తీసుకొచ్చి రైతులకు అమ్మాలని, సీడు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని వ్యవసాయ అధికారి నరసయ్య సూచించారు. కాలవ్యవధి దాటిన విత్తనాలను గాని పురుగుమందులను గాని రైతులకు అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కె.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్కానింగ్ సెంటర్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్ మాట్లాడుతూ.. నగరంలో గల అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌తో పాటు ఇంకా అనేక సెంటర్‌లు సరియైన అనుమతులు లేకుండా, ఆసుపత్రులకు అనుబంధంగా స్కానింగ్ సెంటర్‌లపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని, అయ్యప్ప స్కానింగ్ సెంటర్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్కానింగ్ సెంటర్ల అక్రమాలు వినియోగదారుల రక్షణ చట్టం 2019 పరిధిలోకి వస్తాయని, నిజామాబాద్‌లో జరిగిన సంఘటనపై ఆయా సెంటర్‌ల యాజమాన్యంపై (కేవలం సిబ్బందిపై మాత్రమే కాదు) కఠిన చర్యలు అవసరమని అన్నారు. బాధితులు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేస్తే, వారికి మానసిక వేదనకు నష్టపరిహారం పొందే అవకాశం ఉందని అన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**మెడికవర్, అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి..**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు వైద్యం పేరుతో, స్కానింగ్ సెంటర్స్, ల్యాబ్స్, ఎంఆర్ఐ సెంటర్స్ నిర్వాహకులు స్కానింగ్ పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ ప్రజలను నిలువు దోపిడి చేస్తున్నారని బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం దండి వెంకట్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్‌లో అవసరం లేకున్నా విచ్చలవిడిగా టెస్ట్‌ల పేరుతో ప్రజలను దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కాలంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ హాస్పిటల్స్‌లలో జరిగిన సంఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. కీర్తిసాయి హాస్పిటల్‌లో 4 నెలల గర్భిణి మృతి చెందడం, మెడికవర్ హాస్పిటల్‌లో రెంజల్ మండలానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి మృతిచెందడం, అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో మహిళల ఫోటోలు, వీడియోలు తీసి బ్లాక్మెయిల్ చేసిన విషయం అత్యంత బాధకరమన్నారు. డాక్టర్ల సమాజంపై పౌర సమాజానికి అత్యంత గౌరవ భావం ఉంటుందని, కానీ సమాజంలో అన్ని రంగాల్లో కొంత మంది తప్పుడు విధానాలు అనుసరిస్తుంటారని అలాంటి వారికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్స్, ల్యాబ్స్, ఎంఆర్ఐ సెంటర్స్ నిర్వాహకుల అధిక బిల్లుల వాసులు ఆరోపణలు వచ్చినప్పుడు ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయడానికి వైద్య, ఆరోగ్య శాఖ ఇతర జిల్లా స్థాయి అధికారులతో మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి, బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి జిల్లా కమిటి సభ్యులు టి.రాజు, జి.శ్రీమాన్, బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ బిడిఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్‌లు పాల్గొన్నారు.

## కనుమరుగవుతున్న సంస్కృతి సాంప్రదాయాలను పునరుద్ధరించాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

**నవతెలంగాణ-ఆర్మూర్**

కనుమరుగవుతున్న సంస్కృతి సాంప్రదాయాలను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ బుధవారం నిర్వహించిన సాంస్కృతిక సమావేశంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ గ్రామాలలో కనుమరుగైన సాంస్కృతిక సాంప్రదాయాలని పునరుద్ధరించాలని ఎన్ఆర్ఐ మిత్రులను కోరారు. తెలంగాణ రాష్ట్రాల్లోని గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కోసం ఎన్ఆర్ఐ సోదరులు తమవంతు సహకారం అందించాలని సూచించారు. ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి, లక్కంపల్లి సెజ్‌ను ప్రోత్సహించడంలో పెట్టుబడులతో ముందుకు రావాలని కోరారు. లక్కంపల్లి సెజ్‌తో పాటు ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్లో మండలాల వారీగా కుటీర పరిశ్రమలు, ఇండస్ట్రీలను స్థాపినకు కృషి చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిపించాలని కోరారు. అందుకుగాను ఎన్ఆర్ఐ సోదరులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వారు సన్మానించారు.

## ఊట్పల్లిలో.. తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-బోధన్**

మండలంలోని ఊట్పల్లి గ్రామంలో గత కొన్ని రోజుల నుండి తాగునీరు అందక గ్రామంలోని 11, 12వ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రజల ఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి మంగళవారం రాత్రి ఆయా కాలనీలలో బోర్ వేయించారు. దాంతో కాలనీలో ప్రజల తాగునీటి సమస్య తీరింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు సాయిలు, సాయిరెడ్డి, అశోక్ రెడ్డి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## అవసరం మేరకు విత్తనాలను అందజేస్తున్నాం

- ఏడిఏ అనిత, ప్రదీప్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

జిల్లా రైతుల అవసరమగు పచ్చిరొట్టె, జీలుగా విత్తనాలను అన్ని సహకార సొసైటీలో రైతుల అవసరం మేరకు సరఫరా చేస్తున్నామని రాబోయే ఇంకా అవసరమున్న మేరకు ఆ విత్తనాలను సహకార సొసైటీలకు సరఫరా చేస్తామని ఏడిఏ అనిత, నిజామాబాద్ రూరల్ ఏడిఏ ప్రదీప్ అన్నారు. మండలంలోని బర్దిపూర్ సహకార సొసైటీలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సహకార సొసైటీలు ప్రైవేట్ డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత విధిగా దానికి సంబంధించిన రసీదును తీసుకోవాలన్నారు. నాణ్యమైన ప్యాక్ చేసిన విత్తనాలనే కొనుగోలు చేయాలని వారు సూచించారు. ఎరువులు అవసరాల మేరకు వాడాలని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొంది ఆర్థికంగా లాభపడాలని వారు సూచించారు. బర్దీపూర్ సొసైటీలో 416 బస్తాల జీలుగ విత్తనాలు రైతులకు అందించినట్టు చెప్పారు. టువంటి జీలుగ విత్తనాల కొరత లేకుండా అవసరమైన రైతులకు సరఫరా చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు, సహకార సొసైటీ చైర్మన్ కోసరాజు రామకృష్ణ, ఏఈఓలు ఆశ్రిత, వంశీకృష్ణ, రూపేష్‌తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ అనిత

## పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి

**నవతెలంగాణ-కామారెడ్డి**

2025 గణతంత్ర దినోత్సవం సందర్భంగా సామాజిక, సేవా రంగం, సాహిత్య రంగం, క్రీడా రంగంలో విశిష్ట సేవలందించిన అభ్యర్థుల నుండి పద్మ అవార్డుల కోసం ప్రభుత్వానికి సిఫారసు చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 800 పదాలకు మించకుండా తాము చేసిన కార్యక్రమాల గురించి వివరిస్తూ అవసరమైన డాక్యుమెంట్లను (వర్డ్ అండ్ పిడిఎఫ్) లో 4 జతల హార్డ్ కాపీలతో పాటు ఫార్మాట్ (సాఫ్ట్ కాపీ), నామినేషన్ ఫారాలను జూన్ 1 లోగా కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో గల 223 గదిలోని జిల్లా యువజన క్రీడాధికారి కార్యాలయంలో సమర్పించవలసినదిగా ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http://www.padmaawards.gov.in వెబ్ సైట్ నందు కానీ 9440292793 లేదా 9618126053 నెంబర్లకు సంప్రదించవలసినదిగా దామోదర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.

## విత్తనాల కోసం బారులు

**నవతెలంగాణ-సదాశివనగర్**


బారులు తీరిన రైతులు

విత్తనాల కోసం రైతులు బారులు తీరుతున్నారు. ఒక వైపు కొరత లేదని అధికారులు చెప్తున్నా సొసైటీల ఎదుట రైతుల బారులు తీరుతూ కనిపిస్తున్నారు. మండలంలోని 4 సొసైటీలలో బుధవారం జీలుగా, జనుము విత్తనాలను రైతులకు అందజేశారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, సదాశివనగర్, పద్మాజివాడి, ఉత్నూర్ సొసైటీలలో విత్తనాలు అమ్మారు. ఉదయం నుండి రైతులు బారులు తీరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అదికారి ప్రజాపతి ఏఈఓలు పాల్గొన్నారు.

# ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం

- నెలల తరబడి కాలయాపన
- ఇష్టరాజ్యాంగా సిబ్బంది విధులకు హాజరు
- ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ అభ్యర్థుల ప్రదక్షిణలు
- సమయ పాలన పాటించని సిబ్బంది

**నవతెలంగాణ-కామారెడ్డి**


కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పలువురు అభ్యర్థులు..


దోమకొండలోని తహసీల్దార్ కార్యాలయం

మండలం తహసీల్దార్ కార్యాలయం రూటే వేరు, ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా చెప్పులు అరిగేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే.. వారికి ఏ నిబంధనలో వర్తించవు వారు కార్యాలయానికి వచ్చిందే సమయం, వెళ్ళిందే సమయం ఈ విధంగా దోమకొండ మండల తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతుందని ఆ మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఎప్పుడు వస్తారు ఎప్పుడు వెళ్తారో తెలియదు. ప్రజలకు ఎవరికైనా ఆస్తులు అమ్మకాలు, కొనుగోలైన, పేరు మార్పిడి అయినా, ఇతర అవసరాల కోసం అయినా తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చే ధ్రువీకరణ పత్రాలు ప్రామాణికం. కులం, ఆదాయం, లోకాల్‌క్యాండెట్, ఫ్యామిలీ మెంబర్ వంటివి కావాలి. ప్రస్తుతం విద్యార్థులకు విద్యాసంస్థలు మరో 10,12 రోజుల్లో ప్రారంభం కావడంతో పై చదువులకొరకు విద్యార్థిని, విద్యార్థులకు కులం, ఆదాయం, దూరం, లోకాల్‌క్యాండెట్ వంటి సర్టిఫికెట్‌లు అవసరం అవుతాయి. ఆస్థి మార్పిడి, బ్యాంకులో నగదు ఉంటే, బ్యాంకు కాతదారుడు చనిపోతే ఆ డబ్బును బ్యాంకు నుంచి తీసుకోవాలంటే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరం. కావాలని బ్యాంకు వారు చెపితే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేసుకొని రెండు నెలలు గడిచినా సిబ్బంది ధ్రువీకరణ పత్రం జారీ చేయకుండా నిరక్షంగా వ్యవహరిస్తున్నారు.

దరఖాస్తు దారులు కార్యాలయం చుట్టూ ఎన్ని ప్రదక్షిణాలు చేసిన అధికారుల నిర్లక్ష్యంతో సర్టిఫికెట్ ఇవ్వడంలేదని పలువురు వాపోతున్నారు. మరొకరు ఆస్థి తన తల్లి పేరు నుంచి తన పేరున మార్చుకొందామని వెళితే అక్కడ కూడా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అడిగారని దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు రెండు నెలలు దాటిందని అయినా ఇంకా 15 నుంచి 20 రోజులు పడుతుందని చెపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిని ఇదేంటని అడిగితెనా టేబుల్ మీదికి ఈ రోజే వచ్చిందనీ, నిన్ననే వచ్చింది అని కాలయాపన చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వాళ్ళ సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. సర్టిఫికెట్‌ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోతున్నామని, మరో పని కూడా చేసుకోలేకపోతున్నామని అంటున్నారు.

**సమయానికి రాని అధికారులు**

అధికారులు అప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియదు. వారి ఇష్ట రాజ్యాంగ నడుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. దోమకొండ తహసీల్దార్ కార్యాలయన్ని సంబంధిత శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సందర్శించి తగు చర్యలు తీసుకొని ప్రజలకు అవసరమగు సర్టిఫికెట్‌లు, ఇతర పనూలు అయినా సకాలంలో చేసి ఇచ్చేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## 1.25 కిలోల అల్ఫ్రజోలం స్వాధీనం

- విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

**నవతెలంగాణ-రామారెడ్డి**

కృత్రిమ కళ్ళు తయారీకి వినియోగిస్తున్న మత్తుపదార్థాలను విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అర్ధరాత్రి అరెస్ట్ చేసిన ఘటన రామారెడ్డి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. 1.25 కిలోల అల్ఫోజోలం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గాంధారి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుండి కృత్రిమ కళ్ళు తయారీలో వినియోగించే క్లోరోఫామ్, డైజోఫామ్, ఆల్ఫా జోలం మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోగా, అతని దర్యాప్తు చేపట్టారు. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఆకుల బైరగౌడ్ అతనికి విక్రయించినట్లు సోషల్‌మీడియాలో పోస్టర్‌లు వైరల్ కావడంతో వాటిని సాక్షాధారాలుగా భావించి మంగళవారం అర్ధరాత్రి బైరా గౌడ్ ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. దర్యాప్తు ముమ్మరం చేసి బాధ్యులందరినీ అరెస్టు చేస్తామని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై విక్రమ్ తెలిపారు.

## సిద్ధిరామేశ్వర ఆలయంలో ఆడిటింగ్

**నవతెలంగాణ-భిక్కనూర్**


ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

భిక్కనూర్ మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర స్వామి ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ అధికారులు ఆడిటింగ్ నిర్వహించారు. 2023-2024 సంవత్సరానికి సంబంధించిన అన్ని రికార్డులను ఆడిటర్ శేషు కుమార్ పరిశీలించారు. దేవాలయానికి వచ్చినా ఆదాయ వ్యవహారాలను, ఆలయానికి సంబంధించిన భూముల వివరాలు వాటి ద్వారా వస్తున్న ఆదాయం, జమ ఖర్చును పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

## బోనస్ ఇవ్వని ప్రభుత్వంపై పోరాడుదాం

- ఎస్‌పీఐ జిల్లా కార్యదర్శి భానోత్ రవి



మాట్లాడుతున్న బానోత్ రవి

**నవతెలంగాణ-కామారెడ్డి**

వడ్లకు 500 బోనస్ ఇస్తామని చెప్పి మాట మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలు చేపట్టనున్నట్టు సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా కామారెడ్డి జిల్లా కార్యదర్శి బానోత్ రవి తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినటువంటి ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలకు ఇచ్చిన మాటను తప్పుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సీఎం ప్రస్తుతం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడమేనని దగా చేయడమేనని మండిపడ్డారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారన్నారు. ఈ విషయం తెలిసి రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతాంగానికి భరోసా కల్పించే దిశగా నిరసన కార్యక్రమాలతో పాటు కార్యకర్తలు రైతులకు అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి.ఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కమ్మరి సత్యం, జిల్లా కమిటీ సభ్యులు బోండ్ల రాజు, చాట్ల లింగం, రౌతు శ్రీకాంత్, నర్సాపురం విజయ, పైపావత్ సీతారాం నాయక్, పైపావత ఛందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సురేష్ షెట్కార్‌తోనే జహీరాబాద్ అభివృద్ధి

**నవతెలంగాణ-పిట్లం**


మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ శేఖర్‌తోనే జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు చిప్ప శివ , కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షులు పెనుగండ్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండల విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సురేష్ షెట్కర్ గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశారు. గతంలో సంగారెడ్డి నుండి అకోలా వరకు నిర్మించిన 161 జాతీయ ఫోర్ లైన్స్ రోడ్డు ఆయన హయం లోనే పురుడు పోసుకుందని అన్నారు. ఈ నెల 14న నిర్వహించిన పోలింగ్‌తో అఖండ విజయంతో గెలుపొందుతారని అన్నారు. బోధన్ నుండి వయా బాన్సువాడ , పిట్లం మీదుగా రైల్వే లైన్ పనులు పూర్తిచేసుకుని ప్రయాణికులకు రైలు రవాణా సదుపాయాలను ఏర్పాటు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో అధికారుల నిర్లక్ష్యం

- గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండట్లే
- సర్వసభ్య సమావేశంలో సభ్యులు


మాట్లాడుతున్న ఎంపీపీ

**నవతెలంగాణ-బీబీపేట్(దోమకొండ)**

ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేశారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎంపీపీ బాలమణి, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. బుధవారం బీబీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బాలమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీవైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ ఎంపీటీసీలు మాట్లాడా రు. గ్రామాలలో ని ఉపాధిహామీ ద్వారా కొంత మంది కూలీలకు పని కల్పించుతున్నారని, దరఖాస్తు చేసుకున్న కూలీలకు జాబ్ కార్డ్ ఇవ్వడం లేదన్నరు. ఉపాధి కూలీ లకు తక్కువ గా డబ్బులు వస్తున్నాయాని, కొంత మంది కూలీ లకు డబ్బులు రావడం లేదని ఎంపీటీసీ అధికారులకు తెలిపారు.

ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడడంతో జిల్లా కలెక్టర్ కు కలిసి సమస్య ను వివరించామని, ధాన్యం కొనుగోలు ను త్వరగా పూర్తి చేయాలనీ, ధాన్యం ఆన్ లోడ్ చేసుకొని రైస్ మిల్ యాజమాన్యం పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ శాఖా అధికారులు గ్రామాల్లో లూస్ లైన్ లు మరియు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పోల్స్ ని మరమతులు చేసి పాడయిన వాటిని సరిచేయాలని సభ్యులు సూచించారు. రైతులు ఖరీఫ్ పంటలకు సంబందించి అధికారుల సూచనల మేరకు మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, జీలుగ , జనుము విత్తనాలు సొసైటీలకు అందుబాటులోకి వస్తున్నాయని ఏవో పవన్ తెలిపారు. వచ్చే వర్షా కాలం ప్రారంభం నేపథ్యంలో గ్రామాలలో ని చెరువుల వద్ద తూములను పరిశీలించాలని ఏవైనా తూములకు లీకేజీలు ఉంటే ఇప్పుడే మరమత్తులు చేయాలని ప్రజా ప్రతినిధులు సూచించారు. మండల సర్వ సభ సమావేశనికి ఆయా శాఖల అధికారులు గైహాజరు కావడంతో ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సర్వసభ్య సమావేశంలో, డిసియంఎస్ ఇంచార్జ్ చైర్మన్ ఇంద్ర సేనా రెడ్డి, వైస్ ఎంపిపి రవీందర్ రెడ్డి ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు , పంచాయతీ కార్యదర్శులు , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సహచట్టంపై సాయం పొందండి

- సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ కార్యాలయం ప్రారంభించిన రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం

**నవతెలంగాణ-కామారెడ్డి**


సహచట్ట పరిరక్షణ కమిటీ కార్యాలయం ప్రారంభించిన రాష్ట్ర డైరెక్టర్

పట్టణంలోని దేవునిపల్లి గ్రామంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జిల్లా కార్యాలయం (గ్రామీణ)ను రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ మొహమ్మద్ సాహెబ్ ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారం కోసం సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా గ్రామీణ కార్యాలయాన్ని సందర్శించి వారికి కావాల్సిన సహాయ సహకారాలను సహ చట్ట పరిరక్షణ కమిటీ ద్వారా పొందవచ్చు అని అన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో దరఖాస్తు చేసే విధానం మొదటి ఆపిల్ విధానం, రెండవ ఆపిల్ మొదలగు వాటి గురించి ఉచితంగా సేవలను అందించనున్నట్టు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం లో రాష్ట్ర సలహా దారులు వై.వేణుగోపాల్, మహమ్మద్ అజీజ్‌ఖాన్, జిల్లా అధ్యక్షులు శివ పూజ లింబయ్య, ఉపాధ్యక్షులు షేక్‌అలీముద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి భాస్కర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు న్యాయవాది షబానా బేగం, పట్టణ కార్యదర్శి జమున, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు నూర్జహాన్ బేగం, కాసర్ల లింగం, రాధాకృష్ణ, జోనల్ అధ్యక్షుడు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూళ్లల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

- ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవంలో ప్రతినిధుల డిమాండ్

**నవతెలంగాణ-కామారెడ్డి**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రంలో టిపిటిఎఫ్ పేరుతో ఏర్పడి నేటికి 10సం.లు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు కె.వేణుగోపాల్ పతాకావిష్కరణ చేశారు. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కొరకు ఉమ్మడి రాష్ట్రంలో ఎపిటీఎఫ్ అనేక ఉద్యమాలు చేసిందని, విద్యాశాఖ, జడ్పి కార్యాలయాల్లోని అవినీతి, అక్రమాలను వెలికితీయడమే కాకుండా వాటిని పోరాటాల ద్వారా అరికట్టడానికి ప్రయత్నం చేసిందని, అందులో భాగంగా ఉపాధ్యాయులకు రాజకీయ జోక్యం లేని బదిలీల కౌన్సిలింగ్ వ్యవస్థను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా తీసుకు వచ్చిన ఘనత ఎపిటీఎఫ్ దేనని అన్నారు. అలాంటి ఎపిటీఎఫ్ వారసత్వాన్ని తెలంగాణ రాష్ట్రంలో టీపీటీఎఫ్ కొనసాగిస్తోందన్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, మధ్యలో ఆగిపోయిన బదిలీలు-పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయాలని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని, బదిలీ కాబడి రిలీవ్ కానీ వారిని వెంటనే విడుదల చేయాలని, నెలల తరబడి పెండింగులో ఉన్న అన్నిరకాల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, పాఠశాలల్లో ఉన్న ఖాళీలు భర్తీ చేసేవరకు విద్యావాలంటీర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ పి.నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు కె.నళిని, జిల్లా కార్యదర్శి నరేందర్, సీనియర్ కార్యకర్తలు కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు సిఇచ్ లక్ష్మి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరించిన ప్రతినిధులు

## రోగులకు మెరుగైన సేవలు అందించాలి


పేషెంట్‌లతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

**నవతెలంగాణ-పిట్లం**

ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు మెరుగైన మెరుగైన వైద్య సేవలతో పాటు సరియైయున సదుపాయాలు కల్పించాలని జిల్లా హాస్పిటల్ హెడ్ క్వార్టర్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పేషంట్‌ల వార్డులను పర్యవేక్షించారు. నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆస్పత్రిని పనులను పరిశీలించారు. నిర్మాణ పనులలో జాప్యం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకుని తొందర్లో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్ పేషెంట్లకు కనీస సదుపాయాలు కల్పించాలని సూపర్ డెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్, మెడికల్ ఆఫీసర్ శివకుమార్‌లను ఆదేశించారు. ఆస్పత్రి శుభ్రత విషయంలో జాగ్రత్తలు వహించాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. అనంతరం అటెండెన్స్ రిజిస్టర్ తో పాటు, పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ శైలజ, ఫార్మసిస్ట్ సవిత, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల వ్యవసాయ అధికారి బదిలీ

**నవతెలంగాణ-రామారెడ్డి**

మండల వ్యవసాయ అధికారి సోమ హరీష్ కుమార్‌ను ఎల్లారెడ్డికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డి మండల వ్యవసాయ అధికారి సెలవుపై వెళ్లడంతో అక్కడికి బదిలీ చేశారు. కాగా ఆయన స్థానంలో సదాశివనగర్ మండల వ్యవసాయ అధికారి ప్రజాపతిని ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారిగా నియమించినట్లు ఏడిఏ రత్న తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా అరికట్టండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-బిచ్కుంద**

మంజీరా పరివాహక ప్రాంతమైన కుర్ల మూడవ ఇసుక క్వారీ నుండి వే బిల్లులు లేకుండా అధికలోడుతో కర్ణాటక, మహారాష్ట్ర కు చెందిన లారీలు బిచ్కుంద నుండి వెళ్లడం వల్ల ప్రమాదాలతో పాటు రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అధిక లోడుతో వెళుతున్న లారీలను వెంటనే అరికట్టి చర్యలు తీసుకోవాలని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఐ మోహన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మంజీర పరివాహక ప్రాంతం నుండి ఇసుక రవాణా సాకుతో రోజు వందల సంఖ్యలో వేబిళ్ళులు లేకుండానే రాత్రి పగలు అనే తేడా లేకుండా ముఖ్యంగా కర్ణాటక కు వందల సంఖ్యలో ఇసుక లారీలను రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారని అన్నారు. బిచ్కుంద నుండి ఇసుక లారీలు వెళ్లడం వలన రహదారులు చెడిపోవడంతో పాటు లేచిన దుమ్ము దూళితో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వెంటనే అధికారులు అధిక లోడుతో వే బిల్లులు లేకుండా వెళ్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేవైఎం నాయకులు శెట్టిపల్లి విష్ణు, గంగరాజు, మాల్ పటేల్, సంతోష్ పటేల్, మలుగొండ, మేకల రమేష్, వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

## లూజు విత్తనాలు అమ్మవద్దు

- మండల వ్యవసాయాధికారి దేవిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

లూజు విత్తనాలు అమ్మవద్దని, నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి దేవిక అన్నారు. మండల పరిధిలోని పలు విత్తన కంపెనీలలో, విత్తన రిటైల్ షాప్‌లలో జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతితో కలిసి పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీ ధరకు విక్రయించాలని, రైతులకు విత్తనాలకు సంబంధించిన రసీదును ఇవ్వాలని అన్నారు.


రికార్డును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిని

## విత్తన దుకాణాల తనిఖీ

నవతెలంగాణ-ఏర్గట్ల

ఖరీఫ్ సీజన్ ప్రారంభవుతున్నందున ఏర్గట్ల ఎస్సై మచ్చేంధర్ రెడ్డి ఏఈఓ సాయి సచిన్‌తో కలిసి మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలను బుధవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను, పురుగు మందులను అందివ్వాలని, విత్తనాలు కొన్న వెంటనే రైతుకు ఆ విత్తనాల పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలని అన్నారు. అలాగే డీలర్ ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు తెలిసేలా బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాల వల్ల రైతు నష్టపోతే డీలర్‌పై పీడియాక్ట్ నమోదు చేసి, లైసెన్స్ సైతం రద్దుచేస్తామన్నారు.


తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఎలక్ట్రీషియన్ శిక్షణతో జీవనోపాధి

- నాబార్డ్ డిడిఎం ప్రవీణ్, టిజిబి రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఎలక్ట్రీషియన్ శిక్షణలతో జీవనోపాధికి బాట వేసుకోవచ్చని, ప్రతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డిడిఎం ప్రవీణ్, టిజిబి రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డిచ్‌పల్లి ఆధ్వర్యంలో ఫోటో, వీడియోగ్రఫీ, ఎలక్ట్రిషన్ 30 రోజులు శిక్షణలను బుధవారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రవీణ్, నవీన్ హాజరై మాట్లాడారు. నాబార్డ్ సంస్థ ద్వారా అందిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఫోటోగ్రఫీ, ఎలక్ట్రీషియన్ శిక్షణలు భవిష్యత్‌లో మంచి అవకాశాలుంటాయని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. నాబార్డ్ సంస్థ ఆర్ఎస్ఈటిఐ ట్రైనింగ్స్ శిక్షణ కోసం చాలా రకాల పరికరాలను అందజేస్తుందని పేర్కొన్నారు. వాటిని ఉపయోగించి జీవితంలో స్థిరపడి కుటుంబానికి ఆధారంగా నిలబడాలని సూచించారు. ఫోటోగ్రఫీ అనేది ప్రతి వ్యక్తి ముఖంలో ఒక నవ్వును తెప్పిస్తోందని, జీవితంలో మంచి మరువలేని జ్ఞాపకాలను ఉంచుతుందని దీనికి చాలా చక్కని భవిష్యత్ ఉందని అన్నారు. ఎలక్ట్రీషియన్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని కొత్తగా ఇల్లు కట్టాలంటే ఎలక్ట్రీషియన్ చాలా ముఖ్యమని వివరించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను యువతకు అందిస్తున్న ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణా అనంతరం బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఇలాంటి అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది రామకృష్ణతోపాటు గెస్ట్ ఫాకల్టీలు పాల్గొన్నారు.

## ముప్కాల్‌లో బడిబాట


బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిబాట కార్యక్రమం నిర్వహణలో భాగంగా బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, మధ్యాహ్న సమయంలో (పౌష్టికాహారం) ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు వారి వారి పిల్లలను ఇంటి వద్ద ఉంచకుండా పాఠశాలాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారం, ఉపాధ్యాయులు నవీన్, సురేష్ కుమార్, మధుసూదన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో అలసత్వం వద్దు

నవతెలంగాణ-మోపాల్


పాఠశాల పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి అన్నారు. బుధవారం మండలంలోని కంజర గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపడుతున్న పనులను మోపాల్ ఎంపిడిఓ లింగం నాయక్‌తో కలిసి పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఏఈ మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో చేపట్టాలని అన్నారు. పనులలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## ప్రవేశాలకు 31వరకు ఛాన్స్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం ఈనెల 31వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పలుగుట్ట మహారాజుకు సన్మానం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కేశ్‌పల్లి గ్రామంలోని కేశవనాథ ఆలయానికి వచ్చిన పలుగుట్ట మహారాజును కేశ్‌పల్లి గ్రామస్తులు బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. నందిపేట్ మండల కేంద్రంలోని పలు గుట్ట మహారాజు అయిన రాములు మహారాజు కేశవనాథ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేశ్‌పల్లి గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

## భానుడి ప్రతాపం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. బుధవారం 44 డిగ్రీల ఎండ నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే భానుడి ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం ఐదు దాటినా.. వడగాల్పులు తగ్గడం లేదు. ఏదేమైనా వృద్ధులు, చిన్నారులు ఎండ నుంచి జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

### సమాచారం లేకుండానే

# అమ్మ ఆదర్శ పాఠశాల పనుల కేటాయింపు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన
- పలు అంశాలు లేవనత్తిన ప్రజాప్రతినిధులు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

తమకు సమాచారం లేకుండానే అమ్మ ఆదర్శ పాఠశాల పనుల కేటాయింపు చేపట్టారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావణ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అధికారులు ఆలస్యంగా రావడంతో సర్వసభ్య సమావేశం ఆలస్యంగా ప్రారంభించారు. ఈ సమావేశంలో గ్రామాల్లోని సమస్యలపై చర్చించారు. అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి చదివి వినిపించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. 2023-24 విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఫలితాలలో బాల్కొండ మండలం అత్యుత్తమ ఫలితాలు సాధించిందని తెలిపారు. మండలంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై వివరిస్తుండగా ప్రజాప్రతినిధులైన ఎంపీపీ, ఎంపీటీసీలకు సమాచారం లేకుండా అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులు పలువురికి కేటాయించడంపై ఎంపీటీసీ రామ్‌రాజ్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాజ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. ఎంఈఓ వివరణ ఇస్తూ ఎలక్షన్ కోడ్ ఉండడంతో ఎవరికి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. బాల్కొండ మండల కేంద్రంలో డబుల్ రోడ్డుపై తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూ ఉండడంతో రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి అధికారులను కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమర్టానికి వైద్యులు అందుబాటులో ఉండడం లేదని కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ అధికారులకు తెలిపారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సంగీత మాట్లాడుతూ.. గ్రామాలలో ఎంతో కష్టంగా పెంచుతున్న మొక్కలను, చెట్లను అనవసరంగా నరికేస్తున్నారని, అత్యవసర పరిస్థితులలో చెట్లను నరకాలంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్ద తమ పంట పొలాలకు నిప్పు పెట్టేటప్పుడు మొక్కలను గమనించాలని, చెట్లను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని గుర్తు చేశారు. ఎంపీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండల పరిధిలో ఆరు గ్రామాలలో పన్నులు 100శాతం వసూలు చేశామని, బాల్కొండ, వన్నెల్ బి, బోదేపల్లి, చిట్టాపూర్ గ్రామాలలో 90శాతం వసూలు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీసీ అధికారులు హాజరు కాకపోవడం గమనార్హం. ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, మండల వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కనీస సౌకర్యాలు కల్పించాలి

- సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేత


వినిపత్రాన్ని అందజేస్తున్న లబ్దిదారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలో అసెంబ్లీ సాధారణ ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు రోజుల ముందు అందజేసిన డబుల్ బెడ్ రూంలలో ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామని వెంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ డబుల్ బెడ్ రూం లబ్దిదారులు డబుల్ బెడ్ రూంలవద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం మండల కేంద్రానికి చేరుకుని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంత్‌రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 6 నెలల క్రితం కేటాయించిన డబుల్ బెడ్ రూంలలో కనీస సౌకర్యాలు లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. కరెంటు సౌకర్యం లేక మొత్తం ఒకటే మీటర్‌పై 47డబుల్ బెడ్ రూంలు ఉన్నాయని, డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో దుర్గంధంతో అనారోగ్యంతో బాధపడుతున్నామని అన్నారు. ఈగలు, దోమలతో సాహసం చేయక తప్పడం లేదన్నారు. అన్నీ విషయాలు వివరంగా విన్న ఎంపిడిఓ అనంత్‌రావు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూం లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ సత్కారం


సురేష్‌పవర్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-నవీపేట్

పూనేలోని సిడాక్ కంపెనీలో సెక్యూరిటీ సూపర్వైజర్‌గా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా నిజామాబాద్ ఓడ్ కుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలో సురేష్ పవర్‌కు శాలువాతో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంచార ఓడ్ కులంలో పుట్టి జాతీయ స్థాయిలో రికగ్నైజేడ్ సంస్థలో పనిచేసి రిటైర్మెంట్ పొందడం చాలా గర్వకారణంగా భావిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి జాదవ్ రాజు తెలిపారు. తెలంగాణలో తమ కులానికికు గుర్తింపు పొంది కేవలం మూడు సంవత్సరాలు కావస్తుందని రాష్ట్రంలో కూడా తమ కులస్తులకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జాదవ్ రాజు, పవర్ విజయ్, జాదవ్ నారాయణ, జాదవ్ శరత్, సాలుంకే రమేష్, సాలుంకే సుధీర్, చవాన్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు తీగల ఎత్తు పెంచాలి


ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లు

నవతెలంగాణ-ఎడపల్లి

కరెంట్ విద్యుత్ తీగల ఎత్తు పెంచాలని చౌక ధరల దుకాణం యజమాని ద్రౌపతి గంగాధర్ సంబంధిత ట్రాన్స్‌కో అధికారులను కోరారు. తమ దుకాణంపై నుంచి విద్యుత్ వైర్లు ఉండడం వల్ల సివిల్ సప్లై నుంచి వచ్చిన లారీలకు డౌన్లోడ్ చేయడంలో కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ద్రౌపతి గంగాధర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని 14వ వార్డులో తమ చౌక ధరల దుకాణం ఉందని తెలిపారు. సివిల్ సప్లై నుంచి వచ్చిన లారీలకు విద్యుత్ వైర్లు తగిలే అవకాశముందని, రానున్నది వర్షాకాలం నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

## షెడ్డు నిర్మించండి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలోని వీరభద్రుడి జాతరలో ప్రతి యేటా శివరాత్రి పూర్తయిన మూడు రోజులకు ఇక్కడ జాతర కొనసాగుతుంది. అందులో భాగంగా రథోత్సవాన్ని నిర్వహిస్తారు. కాగా రథోత్సవానికి వినియోగించే రథాన్ని నిలిపిఉంచేందుకు ఎలాంటి షెడ్డు లేదు. దాతలు ముందుకు వచ్చి వీరభద్రుడి ఆలయం సమీపంలో ఒక షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేయాలని, అప్పుడే ఆ రథానికి రక్షణ ఏర్పడుతుందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. దాతలు ముందుకు వచ్చి షెడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు


రికార్డును పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో ఎస్‌హెచ్ఓ కృష్ణ కుమార్, మండల వ్యవసాయ అధికారి నగేష్‌రెడ్డి కలిసి బుధవారం పరిశీలించారు. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సీడ్ లైసెన్సు అనుమతి ఉన్న డీలర్‌ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని అలాగే కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నగేష్‌రెడ్డి తెలిపారు.

# ప్రహరీ లేక.. ప్రమాదాలకు నిలయం


ప్రహరీ గోడ లేని ప్రభుత్వ పాఠశాల

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇటీవల మరమ్మతుల పేరుతో ప్రహరిని కూల్చివే యగా విద్యార్థులకు అది ప్రమాదకరంగా మా రింది. మండల సమావేశంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు ఈ సమస్యను లేవనెత్తినా.. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకో లేదు. ఈ పాఠశాలకు సాటాపూర్, బోర్గాం, తాడ్‌బిలోలి, రెంజల్ గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలో తెలుగు మీడియంతో పాటు, ఉర్దూ మీడియం విద్యను అభ్యసించడానికి ఇక్కడికి వస్తూ ఉంటారు. ప్రధాన రోడ్డు పక్కనే పాఠశాల ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరంలోపు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఎడపల్లి

జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎడపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎడపల్లి ఎంపీడీవో శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి సిబ్బంది పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తప్పకుండా మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## మహిళా శక్తి టైలరింగ్ కేంద్రం ప్రారంభం


టైలరింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులందరికీ పాఠశాల యూనిఫామ్ కుట్టేందుకు అదే మండలంలో గల ఐకెపికి అప్పగించారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలలో మహిళా సంఘాలలో సభ్యత్వం ఉన్న నిరుద్యోగ యువతులకు ఉపాధిమార్గం కల్పించే విధంగా ఉంటుందని, నిరుపేద కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడు తుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఐకేపీకి ఇవ్వడం చాలా సంతోషకమని అన్నారు. అలాగే ఐకెపి ఆధ్వర్యంలో కుట్టు మిషన్లలో కుట్టి యూనిఫామ్ దుస్తులను సంబంధించిన పాఠశాల విద్యార్థులకు అందజేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఇటువంటి పథకాన్ని ఐకెపికి అందించడం చాలా శుభసూచకమని ఏపీఎం మోహన్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిసిలు హరిబాబు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


## పెస్టిసైడ్ డీలర్ షాపులు పరిశీలన


విత్తనాల దుకాణాన్ని పరిశీలించిన అధికారిని

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని పేస్టిసైడ్ షాపులను మండల వ్యవసాయాధికారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా షాపులలోని రైతువారి విత్తనాల అమ్మకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమానులు, సొసైటీ హెడ్ క్లర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## గ్రీన్ ల్యాండ్స్ కమ్యూనిటీ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి


శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ పరిధిలోని ఆచన్‌పల్లి గ్రీన్ ల్యాండ్స్ కమ్యూనిటీ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బీర్కూర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా నాగార్జున్‌గౌడ్, కార్యదర్శిగా కొమ్మినేని వెంకటేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శిగా వేణుగోపాల్, ట్రెజరర్‌గా ముక్తినేని వెంకటేశ్వర్ రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా నూనె జగపతిరావు, మద్దినేని పార్వతి, జెట్టి హనుమంతరావు, శివారెడ్డి, వంశీ కృష్ణారెడ్డి, ఉప్పు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ కమిటీ 2024-2027 కాలానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వివరించారు. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ ఎంఈఓ బాలగంగాధర్‌రావు, సహాయ ఎన్నికల అధికారులుగా మహేష్ చంద్ర, కృష్ణారెడ్డి వ్యవహరించారు.

## విత్తన దుకాణాలు పరిశీలించిన అధికారులు

**నవతెలంగాణ-కోటగిరి**

మండలంలో పలు విత్తన దుకాణాలను ఎస్ఐ సందీప్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. నకిలీ విత్తనాలను అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం కోటగిరి గ్రామ చావిడి వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఆస్మా బేగం తదితరులు పాల్గొన్నారు.


విత్తనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ తిరిగి అప్పగింత

**నవతెలంగాణ-ఏర్గట్ల**

మండల కేంద్రానికి చెందిన మెరుగు గంగయ్య ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఈ విషయమై ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో పోయిన మొబైల్ ఫోన్‌ను పోలీస్‌లు వెతికి పట్టుకున్నారు. లభ్యమైన ఫోన్‌ను ఏర్గట్ల ఎస్సై మచ్చేంధర్‌రెడ్డి సదరు వ్యక్తికి బుధవారం అందజేశారు.



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై

# ప్రభుత్వ పనులపై సమాచారం ఇవ్వట్లే

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం

**నవతెలంగాణ-వర్ని**

మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలలో ప్రభుత్వ పనులు మంజూరు అయితే ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలకు సమాచారం ఇవ్వటం లేదని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి మండిపడ్డారు. మిషన్ భగీరథ నీరు రాకపోతే, కొన్ని గ్రామాలలో బోరు మోటార్లు ఏర్పాటు చేసినా తమకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని భగీరథ అధికారులను నిలదీశారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు ఆలస్యంగా రావడంతో ఉదయం 10 గంటలకు కొనసాగాల్సిన సమావేశం 12 గంటలకు కొనసాగించారు. ఈ సమావేశంలో అధికారులు శాఖల వారీగా సమాచారాలు తెలిపారు. విద్యాశాఖ మండల అధికారి శాంతి కుమారి మాట్లాడుతూ.. ఉమ్మడి మండలాల్లో పదో తరగతి విద్యార్థులు 66శాతం ఉత్తీర్ణత సాధించారని అందులో జ్యోతిబాపూలే విద్యార్థులు ఘనవిజయం సాధించారని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో కేవలం మహిళా సంఘాల అధ్యక్షులు చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. 27 పాఠశాలకు మరమ్మతులకు ఎంపిక చేశామని, పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో ఎంపిక చేసిన పాఠశాలల పనులు ఎంతవరకు వచ్చాయని వాటికి సంబంధించిన బిల్లులు ఎందుకు రాలేవని ఎంపిటిసి బాలరాజు ప్రశ్నించారు. అందుకు పంచాయతీరాజ్ ఏఈ గంగాకిరణ్ వాటికి సంబంధించిన బిల్లులకు నమోదును చేసి జిల్లా కలెక్టరుకు అందజేశామని తెలిపారు. ప్రత్యేక అధికారుల పాలనలో మిషన్ భగీరథ నీరు 15 రోజులపాటు ఎన్నికల సమయంలో రాలేవని వైస్ ఎంపీపీ బాలరాజు ప్రశ్నించగా మిషన్ భగీరథ నీళ్లు ఎక్కడ కూడా ఆపలేదని నీళ్లు వస్తున్నాయని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. ఎక్కడైతే మిషన్ భగీరథ లీకేజీలు ఉంటాయో వాటిని తొందరగా మరమ్మతులు చేపట్టి లికేజీలను ఆపాలని ప్రజలకు తాగునీరు అందించాలని తెలిపారు. మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ పంట విత్తనాలు కూడా ప్రస్తుతం సబ్సిడీ లేదని విత్తనాలను నేరుగా కొనుక్కోవాల్సిందేనని తెలిపారు. రైతులు జీలుగా విత్తనాలు కొనుగోలు చేసుకోవాలంటే స్థానిక పిఏసిఎస్ సంఘాలలో రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయేది వర్షాకాలం కావడంతో ఎక్కడైతే గ్రామాలలో పశువులు ఉంటాయో అక్కడక్కడ ఇప్పటివరకు అందించిన మందులే కాకుండా వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని నట్టల నివారణ మందులను జూన్ మొదటి నుంచి ఇవ్వబోతున్నట్లు వెటర్నరీ వైద్యులు సతీష్ పేర్కొన్నారు. మండలంలో మొత్తం 40 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయని అందులో రెండు అంగన్వాడి సెంటర్లలో టీచర్లు లేకుండా ఖాళీగా ఉన్నాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ తెలిపారు. పోడు భూములలో మోటర్లు వేసుకోవడానికి అనుమతులు ఇవ్వడం లేదని అటవీశాఖ అధికారులు పెత్తనం చెలాయిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సిద్ధాపూర్ ఎంపీటీసీ సాయిలు తెలిపారు. అందుకు జిల్లా అటవీ అధికారులతో మాట్లాడి తమకు సమాచారం ఇస్తే పోడు భూముల సాగుకు సంబంధించి బోరు మోటర్లు వేసుకుని అనుమతులు ఇస్తారని సెక్షన్ అధికారి తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తహసీల్దార్ సాయిలు తెలిపారు. వచ్చే నెల ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రభుత్వ ఆదేశాలు ఏవైనా జారీ అయితే వెంటనే ప్రజలకు తెలుపుతామని అప్పుడు ఆన్‌లైన్ ద్వారా కానీ నేరుగా కానీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పిటిసి హరిదాస్, ఎంపీపీ మేక శ్రీలక్ష్మి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సాయిలు, ఎంపీఓ చందర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

## స్కానింగ్ సెంటర్‌లపై అపోహలు నమ్మొద్దు : సీపీ

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

అన్ని స్కానింగ్ సెంటర్లలో ఫోటోలు వీడియోలు తీస్తున్నట్టు వస్తున్న వదంతులు నమ్మొద్దని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. స్కానింగ్ సెంటర్ లో వచ్చిన మహిళలకు అభద్రతాభావం ఉండవద్దని పేర్కొన్నారు. గత 15 రోజుల క్రితం ఓ స్కానింగ్ సెంటర్‌లో మహిళను వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందడంతో తప్పు చేసిన వ్యక్తిపై కేసు పెట్టి జైలకు పంపామని తెలిపారు. అన్ని స్కానింగ్ సెంటర్లలో అలా జరగడం లేదని దానిపైన విచారణ కమిటీ వేసి విచారించినట్టు తెలిపారు. స్కానింగ్ సెంటర్ ల యాజమానులు సైతం మెడికల్, నాన్ మెడికల్ వారిని అబ్జర్వేషన్ చేస్తూ ఉండాలని అన్నింటిలోనూ అందరిని అనుమతించకూడదని సూచించారు. ఒకవేళ పరీక్ష కు వెళ్లిన వారికి అన్ సేఫ్ అనిపిస్తే (భద్రత లేదు అని అనిపిస్తే) స్కానింగ్ సెంటర్ యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లాలని, అయినా అక్కడ ఎటువంటి స్పందన రాకుంటే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో ముగ్గురిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థి, మధ్యాహ్నం ఇద్దరు రెండవ సంవత్సరం విద్యార్థులు కాపీయింగ్ చేస్తుండగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ రవికుమార్ తెలియజేశారు. డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం ఒక విద్యార్థి, మధ్యాహ్నం ఇద్దరు విద్యార్థులు చీటీలతో కాపీయింగ్ చేస్తుండగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. బుధవారం గణితం బి జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి.

ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం విద్యార్థులు 8,468 మందికి గాను 366 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 8,102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీ టి. రవికుమార్ తెలియజేశారు. ఉదయం మొత్తం 28 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని ఇంటర్ విద్య అధికారి తెలియజేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రజియుద్దీన్ అస్లాం, దేవరామ్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సెట్టింగ్స్ స్క్వాడ్‌లు మొత్తం 25 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా జిల్లా ఇంటర్ విద్యాధికారి 3 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 95.7శాతం మంది విద్యార్థులు ఉదయం హాజరయ్యారు. మధ్యాహ్నం రెండవ సంవత్సరం పరీక్షలకు మొత్తం విద్యార్థులు 2,800 మందికి గాను 2,690మంది హాజరు కాగా 110 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మొత్తం 27 పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేయగా, జిల్లా ఇంటర్ విద్యా అధికారి 3 పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారు. మధ్యాహ్నం మొత్తం 96.1శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

## ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట్ మండల కేంద్రంలోని ఎరువుల విత్తనాల దుకాణాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ తనిఖీ చేపట్టారు. జిల్లా అధికార ఆదేశానుసారం మండల కేంద్రంలోని అన్ని విత్తన ఎరువుల విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి అందులో రైతులు కొనుగోలు చేసిన విత్తనాల వివరాలను రిజిస్టర్‌ల పొందుపరుస్తున్నారో లేదో పరిశీలించారు. ఎంత మంది రైతులు కొనుగోలు చేశారో రిజిస్టర్‌లో తనిఖీ చేశారు. అంతేకాకుండా ప్రతిరోజు ఎరువుల విత్తనాలు తనిఖీ చేసి రోజువారీగా ఎంతమంది రైతులు రోజువారిగా ఏ విత్తనాలు కొనుగోలు చేస్తున్నారో వివరాలు పరిశీలించనున్నట్టు తెలిపారు. ప్రతి ఎరువుల విత్తనాల దుకాణల నిర్వాహకులు ఎరువులు విత్తనాలు డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేయవద్దనీ రైతులకు సూచించారు ఎరువులు విత్తనాలుకొనుగోలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి ఆయన అన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట్ మండలం లోని అయ్యపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన చల్ల దేవయ్య ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. అయ్యపల్లి గ్రామానికి చెందిన చల్ల దేవయ్య మంగళవారం ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో వారి బంధువుల వద్ద కు బోనాల పండుగ ఉందని ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి ఇంటి చుట్టూ భవంతి ఉండడంతో ఇంటిపై నుంచి ఎక్కి సలాకాలను తొలగించి దొంగలు లోపలికి చొరబడ్డారు. ఇంట్లో వస్తువులను చెల్లాచెదురు చేశారు. ఇంట్లో బీరువాను పగలగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, 75 తులాల వెండి 50 వేల రూపాయల నగదు తో పాటు ఇతర విలువైన వస్తువులను దొంగిలించారు. దేవయ్య బోనాల పండుగకు వెళ్లి బుధవారం ఉదయం అయ్యపల్లి గ్రామానికి చేరుకున్నారు. తన ఇంటికి వెళ్లి తాళం తీసి ఇంట్లోకి వెళ్ళగా విలువైన సామాన్లు చెల్లాచెదురు కావడంతో అనుమానం వచ్చి లోపల బీరువా ఉన్న రూంలోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి అందులో ఉన్న బంగారం నగదు వెండి దొంగలించారని చుట్టు భవంతి కావడంతో ఇంటి పై నుండి పెంకలు తొలగించి సాలకలనుచి లోపలికి చరబడ్డారన్నారు. ఈ విషయం గ్రామస్తులకు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు లింగంపేట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి అక్కడికి చేరుకున్నారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం కామారెడ్డికి సమాచారం అందించడంతో క్లూస్ టీం వచ్చి దొంగతనం జరిగిన తీరు వేలిముద్రలు సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని లింగంపేట ఎస్ఐ తెలిపారు.


ఇంట్లోకి వెళ్లేందుకు దుండగులు వేసిన కన్నం

# హామీలను అమలు చేయాలి

- ఐదేండ్లు సహకరించిన వారందరికీ రుణపడి ఉంటాం
- ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని ఎంపీపీ భదవత్ రమేష్ నాయక్ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ప్రజలను మభ్య పెట్టారని విమర్శించారు. బుధవారం ఇందల్‌వాయి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భదవత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ..

మండలంలోని చంద్రయాన్ పల్లి గ్రామస్తులు జనరల్ వచ్చిన ఎంపీటీసీగా పోటీ చేసినప్పుడు ఏకగ్రీవంగా ఎంపిక చేయడం వల్లే ఎంపీపీ పదవి అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్ గౌడ్ సహాయ సహకారంతో ఎంపీపీగా ఐదేళ్లపాటు కొనసాగినట్లు వివరించారు. గ్రామంలో కనీవినీ ఎరుగని రీతిలో మండలంలోని నెంబర్ వన్‌గా ఉంచడానికి ఆరు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానన్నారు. ఇదే కాకుండా మండలంలోని అన్ని గ్రామాలలో రహదారులు, ఆయా కుల సంఘాల భవనాల నిర్మాణాలకు ప్రత్యేక కృషి చేసినట్లు ఆయన వివరించారు. ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని కానీ గత 15 నెలలు తన వద్దకు ఆయా పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు వచ్చి ఎన్నో పనులు చేయించుకున్నారని ఏరోజు కక్ష సాధింపు చేయలేదన్నారు. కానీ గత కొన్ని నెలలుగా కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఉద్యమం నుంచి వచ్చిన వాళ్ళమని, ఎవరి బెదిరింపులకు పాల్పడినా బెదిరేదీ లేదన్నారు. గతంలో నూతన పనుల కోసం ప్రొసిడింగ్ పత్రాలు అందజేసి శిలాఫలకం వేసిన దాన్ని రద్దుచేసి మరోసారి పనులను ప్రారంభించడం సరైంది కాదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అనంత్ రావు, ఎంపీఓ రాజ్‌కాంత్‌రావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ విమలబాయి, ఎంపిటిసిలు చింతల దాస్, మారంపల్లి సుధాకర్, కచ్చుకాయల అశ్విని శ్రీనివాస్, బాబురావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, ఎంపీలు కిషన్, దీప్‌చంద్‌తోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బాదవత్ రమేష్‌నాయక్

**వ్యవసాయ శాఖ అధికారి మృతి పట్ల సంతాపం..**

ఇందల్‌వాయి మండల వ్యవసాయశాఖ ఇంచార్జీ అధికారిగా ఉన్న ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా మృతి చెందడం పట్ల సంతాపం తెలిపారు. రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## ఇంటి దీపం మహాజన సభ


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-మోపాల్**

మండలంలోని బోర్గం (పి) గ్రామంలో గల ఓ ప్రైవేట్ హాల్‌లో బుధవారం ఇంటి దీపం ప్రొడ్యూసర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ ప్రైమరీ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ ఎనిమిదవ మహాజనసభ సంఘం సమావేశాన్ని మేనేజర్ లలిత ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం ఆదాయ వ్యయాలను మేనేజర్ లలిత వివరించారు. ఈ సంఘంలో 1876 మంది ఖాతాదారులు ఉన్నారని, ఇప్పటివరకు ఒక కోటి 50 లక్షలు రూపాయలను రుణాలుగా అందజేశామని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి 7,50,000 సంఘానికి రాబడి చేకూరిందని ఆమె తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మోపాల్ మండల వ్యవసాయ అధికారి రవీందర్ హాజరై మాట్లాడుతూ.. ముఖ్యంగా విత్తన కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. లూజుగా ఉన్న విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కూడా కొనవద్దని అలాగే కొనుగోలు చేసిన సమయంలో కచ్చితంగా రసీదును పొందాలని, విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో జేబన్న, సంఘం అధ్యక్షులు బుచ్చిగంగు, బాలామణి, చిన్నుబాయి తదితరులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**నవతెలంగాణ-నందిపేట్**

మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి వాకిడి సంతోష్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సాదాసీదాగా కొనసాగింది. సర్పంచులు పదవీకాలం ముగియడంతో ఎంపీటీసీలు హాజరు అయ్యారు. పలువురు ఎంపీటీసీలు తమ గ్రామ సమస్యలను అధికారులకు విన్నవించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖ నివేదికను చదివి వినిపించారు. అధికారులను వైస్ ఎంపిపి నిలదీశారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తానన్న బోనస్ సన్నాలకేన లేదా దొడ్డు రకానికి కూడా ఇస్తున్నారా..? అని అధికారులను ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత పై అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు తెలియజేస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు. ఐలాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా గ్రామస్తులకు నీళ్ల సరిగా రావడం లేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వివిధ గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు, వేసవికాలన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ ఆనంద్ కుమార్, ఎంపీటీసీలు, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సంతోష్‌రెడ్డి

## సహకార సంఘం తనిఖీ


సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

**నవతెలంగాణ-పోతంగల్**

మండల కేంద్రంలోని సహకార సంఘాన్ని వ్యవసాయాధికారి శ్రీనివాస్, సుప్రియ, వ్యవసాయ విస్తరణ అధికారి సహకార సంఘాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు తమ సమస్యలను వ్యవసాయ అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.

# కోటిన్నరతో పరారైన దంపతులు

- లబోదిబోమంటున్న బాధితులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణంలోని పెర్కిట్‌లో నివసిస్తున్న నీలకంఠం ప్రవీణ్, సతీమణి నీలకంఠం సాయి లావణ్య కోటిన్నర డబ్బులకు ఎగనామం పెడుతూ రాత్రికి రాత్రే పరారైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. నీలకంఠం ప్రవీణ్ దంపతులు డబ్బులు ఇచ్చిన వ్యక్తులకు ఎవరికీ తెలవకుండా రాత్రికి రాత్రే పెర్కిట్ నుంచి ఉడాయించారు. దీంతో పెర్కిట్ ఏరియాలో జాతీయ రహదారి పక్కన కిరాణా, జనరల్ దుకాణాలతో పాటు చీరల దుకాణాన్ని సైతం ఆ దంపతులు నిర్వహించేవారు. ఆ దంపతులు రాత్రికి రాత్రే ఉడాయించగా.. పెర్కిట్‌లోని కాంతి హై స్కూల్‌లో వారి పిల్లల టీసీలను కూడా తీసుకెళ్లి గ్రామానికి తిరిగి రాకుండా పకడ్బందీగా అన్ని సిద్ధం చేసుకుని పరారయ్యారు. ఆ దుకాణ ఏరియాల్లోకి ఆ దంపతులకు డబ్బులు ఇచ్చి మోసపోయిన సుమారు 60 మంది వ్యక్తులు రెండు రోజులుగా వస్తూ వెళ్తూ వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని ఆర్మూర్, బాల్కొండ, జక్రాన్‌పల్లి తదితర మండలాల్లోని గ్రామాల్లోని ప్రజల నుంచి నమ్మకం కలిగించి దండిగా డబ్బులను కట్టించుకుని దంపతులు పరారవడంతో వారికి డబ్బులు ఇచ్చి మోసపోయిన వ్యక్తులు వారి దుకాణాల వద్దకు వచ్చి రెండు రోజులుగా లబోదిబోమని మొత్తుకుంటున్నట్లు తెలిసింది. సదరు దంపతులు వారి ఇరువురి సెల్‌ఫోన్లను కాల్ డైవర్ట్ పెట్టి, స్విచ్ ఆఫ్ చేసి, ఎటు వెళ్లారో తెలియకుండా చేస్తున్నారని వారికి డబ్బులు ఇచ్చి మోసపోయిన వ్యక్తులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఏది ఏమైనా అమాయక ప్రజలను నమ్మించి మోసగించి కోటిన్నర డబ్బులతో ఉడాయించిన నీలకంఠం ప్రవీణ్ నీలకంఠం సాయి లావణ్య దంపతులను సంబంధిత అధికారులు పట్టుకొని మోసపోయిన తమకు న్యాయం చేయాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

# మార్కెట్ యార్డును సందర్శించిన ఈనామ్ సభ్యులు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ మార్కెట్ యార్డును ఈనామ్ సభ్యులు బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఈనామ్ ప్రక్రియ వివరాల గురించి మార్కెట్ యార్డు కార్యదర్శి వెంకటేశంను అడిగి తెలుసుకున్నారు. ఈనామ్ పక్రియ ద్వారా రైతులకు మార్కెట్ కమిటీలో నిర్వహించే వ్యాపారులకు, వ్యాపార లావాదేవీల నిమిత్తం రైతులకు సుభతరంగా ఉందని తెలిపారు. ఈ టీంలో న్యూఢిల్లీ అడిషనల్ ఎకనామిక్ అడ్వైజర్ ఐఈఎస్ కే.కావ్యరసన్, డిప్యూటీ అగ్రికల్చరల్ మార్కెటింగ్ అడ్వైజర్ ఎమ్.జవహర్, అసిస్టెంట్ ఎకనామిక్ అడ్వైజర్ శశిరాజన్ వర్మ, మార్కెటింగ్ ఇంటలిజన్స్ యూనిట్ పియూస్ హైదరాబాద్ మార్కెటింగ్ శాఖ వైజే పద్మవర్ష తదితరులు పాల్గొన్నారు.



## లాకర్ కీ పోయినది

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను మచ్చ జ్యోతి, భర్త పేరు మచ్చ వెంకటేష్, R/O ఆర్య నగర్, జిల్లా: నిజామాబాద్. నా బ్యాంక్ పని నిమిత్తం నేను నాందేవాడ నుండి ఆర్యనగర్ కు నా స్కూటీ పై వెళ్తుండగా మార్గమధ్యలో మా యొక్క బ్యాంక్ లాకర్ కీ (లాకర్ No: 0-18) పోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ సెల్ నెం. 94418 61347 కు ఫోన్ చేసి తెలపగలరు.